క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెళ్లకూరు: మండలంలోని దిగువచావలిలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా మహావీర్ జయంతి



మహావీర్ పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న జైనులు

గూడూరు: పట్టణంలోని జైనులు మహావీర్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. భగవాన్ మహావీరుడి పల్లకి ఉత్సవం జరిపారు. రాజవీధిలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మనీష్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబితా తయారు చేయండి

తడ: అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు చేసిన ప్రభుత్వ పనులకు బిల్లులు రాని పనుల జాబితాను సిద్ధం చేయాలని ఎంపీపీ కే రఘురెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులకు సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం



రాములవారి ఊరేగింపు

సైదాపురం: శ్రీరామనవమిని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని ఊటుకూరు రామమందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గ్రామోత్సవం జరిపారు. పార్వేట ఉత్సవం నిర్వహించారు.

తాగునీటి బోరు మోటార్ల మరమ్మతు

ఓజిలి: మండల కేంద్రంలో కాలిపోయిన తాగునీటి పథకం బోరు మోటార్లను మరమ్మతు చేయించారు. రెండు రోజులు కిందట ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పంచాయతీలోని రెండు తాగునీటి పథకాల మోటార్లు కాలిపోయాయి. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులకు పడుతున్నారు. స్పందించిన ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావుయాదవ్ రెండు మోటార్లను మరమ్మతు చేయించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయితీలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తామన్నారు.

చేపల ఉత్పత్తిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మత్స్య శాఖ అధికారులు

దొరవారిసత్రం: పూలతోట సచివాలయంలో చేపల ఉత్పత్తులపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం కూడా కొనసాగింది. పులికాట్ సరస్సు, చెరువులపై ఆధారపడి జీవనం సాగించే ఎస్సీ, ఎస్టీలు ఇళ్లలో చేపల ఉత్పత్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ముత్తుకూరు మత్స్యశాఖ ప్రొఫెసర్ మమత తెలిపారు. ఈకార్యక్రమంలో మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, ఏపీఎం పద్మావతి, సాగర్ మిత్రలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స చేయిస్తున్న వైద్య సిబ్బంది

సైదాపురం: మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఎదురుగా వచ్చే ఆటోను తప్పించబోయి అదుపు తప్పి పడడంతో గాయపడిన సంఘటన మండలంలోని పాలూరులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని పొలూరు గ్రామానికి చెందిన శ్రీను, గణేష్ స్వగ్రామం నుంచి సైదాపురం గ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపు తప్పి బైక్ పడిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీను తీవ్రంగా గాయపడగా గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సైదాపురం పీహెచ్‌సీకి తరలించారు.

నగరవనం.. ఆహ్లాదం

పట్టణ, నగర జీవనం యాంత్రికంగా మారుతోంది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఉరుకులు, పరుగుల జీవితం. ఉద్యోగాలు..వృత్తివ్యాపారాలతో పెద్దలు.. చదువుల ఒత్తిడితో పిల్లలు మానసిక ఒత్తిడితో సంతోషాలకు దూరమవుతున్నారు. వీటి నుంచి ప్రజలను విముక్తులను చేసి ఆహ్లాదం పంచేందుకు నాయుడుపేట మున్సిపాలిటీ పట్టణ నడిబొడ్డున నగరవనం ఏర్పాటు చేసింది. ఆహ్లాదం పంచి, ఆటవిడుపు కలిగిస్తోంది.

- గాంధీపార్కు సుందరీకణ
- సేద తీరుతున్న ప్రజలు



విద్యుత్ దీపాల వెలుగులో గాంధీపార్కు

నాయుడుపేటటౌన్: శిథిలావస్థలో ఉన్న గాంధీ పార్కును నుడా, ప్రత్యేక నిధులు రూ.1 కోటి వ్యయంతో రెండేళ్ల కిందట ఆధునీకీకరించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో పార్కులో పిల్లలతోపాటు మహిళలు, పెద్దలకు సైతం వ్యాయామానికి పరికరాలు, పలు క్రీడా వస్తువులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పార్కులో పచ్చిక బయళ్ల మధ్య గాంధీజీ విగ్రహం నిర్మించారు. ఇటీవల రెండో విడతగా పార్కు అభివృద్ధికి సుమారు రూ.25 లక్షలకు పైగా నిధులు కేటాయించారు. ఈ నిధులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలు రాత్రి 8 గంటల వరకు పార్కులో సేద తీరుతున్నారు. పార్కుకు రక్షణగా వాచ్‌మన్‌ను నియమించారు. వాచ్‌మన్ అక్కడే ఉండేలా చిన్న భవనం నిర్మించారు. పార్కులో ప్రత్యేకంగా వాష్ రూమ్, వర్షం వస్తే పార్కులో ఉండేవారు తడవకుండ ఉండేందుకు షెల్టర్ తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. పట్టణ ప్రజలతోపాటు మేనకూరు, శ్రీసిటీలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం ఆదివారం ఆటవిడుపు కోసం గాంధీపార్కుకు వస్తున్నారు. దీంతో ఆదివారం అయితే పార్కులో పండుగ వాతావరణం నెలకొంటోంది.



ఆడుకుంటున్న పిల్లలు

ఆహ్లాదకర వాతావరణం



పట్టణంలోని గాంధీ పార్కులో ఆహ్లాదకర వాతావరణం ఉంది. దీంతో నిత్యం బిజీబిజీగా ఉండే ఉద్యోగులు, వ్యాపారులకు ఆటవిడుపుగా ఉంది. చాలా చక్కగా అన్ని ఏర్పాట్లు చేశారు. వాకింగ్ ట్రాక్‌బాగుంది. పిల్లలు ఆడుకునేందుకు చాల పరికరాలను ఏర్పాటు చేశారు. వారాంతంలో పిల్లలతో ఎంతో సరదాగా గడుపుతున్నాం.

– సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నాయుడుపేట

శోభాయమానంగా పార్కు



పాలకవర్గం సారథ్యంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మేలా గాంధీపార్కును విద్యుత్ దీపాలతో శోభాయమనంగా తీర్చిదిద్దాం. ప్రజల సూచల మేరకు గాంధీపార్కులో అందరికి ఆహ్లాదం కలిగించేలా మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

– కటకం దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్, నాయుడుపేట

అందంగా తీర్చిదిద్దేలా చర్యలు



పట్టణంలోని గాంధీపార్కును మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. పార్కులో అందమైన మొక్కలు సైతం నాటేందుకు చర్యలు చేపడుతున్నాం. పట్టణంలో బీఎంఆర్ నగర్, ఎల్ఏ సాగరం వద్ద మరో రెండు పార్కులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– శ్రీనివాసరావు, కమిషనర్, నాయుడుపేట

అన్ని వర్గాలకు ఆసరాగా పింఛన్లు



చాపలపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజశేఖర్



పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శారద, వలంటీర్ అనుషా



ఇస్కపల్లెలో..

డక్కిలి: అన్ని వర్గాల ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హత ఉంటే పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. మండలంలోని చాపలపల్లెలో గృహసారథులు, వలంటీర్లతో కలిసి మంగళవారం ఎంపీపీ పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 6,435 మందికి గాను 4,445 మందికి పింఛన్ అందజేసి, 70 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పింఛన్‌దారులందరికీ అందజేస్తారని చెప్పారు. అర్హులుంటే కొత్త పింఛన్లకు మే 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సామాజిక పింఛన్లు పంపిణీ

చిల్లకూరు: మండలంలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. వల్లిపేడు గ్రామానికి చెందిన బండి రమణమ్మ అనే వృద్ధురాలు పక్షవాతంతో మంచానికే పరిమితం అయ్యింది. దీంతో ఆమెకు ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ పిట్ల పవన్‌కళ్యాణ్ వేలి ముద్రలు సేకరించి పింఛన్ అందజేశారు.

తెల్లవారు జాము నుంచే..

చిట్టమూరు: మండలంలో వలంటీర్లు మంగళవారం తెల్లవారు జాము నుంచే అవ్వా, తాతలకు పింఛన్లు అందజేశారు. మండలంలో 5,243 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. వాటిలో 90 శాతం పైగా పింఛన్లను పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

80 శాతం పంపిణీ

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో 80 శాతానికి పైగా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4,202 పింఛన్‌లకు గాను 3,500 వరకు పంపిణీ చేశామన్నారు. వలంటీర్లు తెల్లవారిజాము నుంచే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్లు పంపిణీ వేగవంతం చేయాలి

ఓజిలి: సామాజిక పింఛన్ పంపిణీని వేగవంతం చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని రాచపాళెం, మానమాల, కురుగొండ, వెంకటరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులు, వికలాంగులు, వృద్ధాప్య, చేనేత, డప్పుకళాకారులు పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం మండలంలో 5,526 పింఛన్లుకుగాను 3,109 పింఛన్లు పంపిణీ చేశారన్నారు. రాచపాళెం పంచాయితీలో సర్పంచ్ ముపాళ్ల శారద, సచివాలయ కన్వీనర్ నందిమండలం మనోహర్‌రాజు, గృహసారథి వెంకటేశ్వర్లురాజు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

ఇంటి వద్దకే పింఛన్

సైదాపురం: మండలంలోని 31 పంచాయతీల్లో మంగళవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యకమం నిర్వహించారు. వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి, వారి ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేశారు.

స్టేడియానికి స్థలం కేటాయించండి



వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ఏరియా ఆస్పత్రికి అవసమైన మేరకు స్థలం ఉందని, అందులో కొంత స్థలం స్టేడియానికి కేటాయించాలని ఏపీవీవీపీ ఏరియా ఆస్పత్రి కమిషనర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు కోరారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన్ని కలిసి ఈ మేరకు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున, పట్టణ ప్రజలందరికీ అందుబాటులో ఉన్న అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియానికి సంబంధించిన కొంతస్థలాన్ని గతంలో ఆంధ్ర మహిళా మండలికి ఇచ్చారన్నారు. ఈ మేరకు స్టేడియాన్ని వృత్తాకారంలో తీర్చిదిద్దడానికి ఈశాన్య భాగంలో అవసరమైన స్థలాన్ని అందజేయాలని కోరామని చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓజిలి: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షకు ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ రజనీకుమారి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థి ఫొటో, రేషన్‌కార్డు జెరాక్స్‌తోపాటు 2009–2012 మధ్య విద్యార్థి చదివిన ఐదో తరగతి సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీటీడబ్ల్యూర్, ఈఎంఆర్ పాఠశాలలు, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ తుదిగడువు అన్నారు. విద్యార్థులు ఈ నెల 30వ తేదీన వాకాటివారికండ్రిగలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

గూడూరు: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సెలవుల్లో ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభించిన గూడూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాల వద్ద ఏబీవీపీ కన్వీనర్ చిన్న మాట్లాడుతూ సెలవుల్లో కళాశాలను నడపడంతో విద్యార్థులు నష్టపోతారన్నారు. ఇతర విద్యార్థులు చదువులో వెనుకపడి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్ కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

7 నుంచి 'మా నమ్మకం.. నువ్వే జగన్'



కిట్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్: రూరల్ మండలంలోని 11 సచివాలయాల్లో ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాలను నిర్వహించనున్నామని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమనారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని, మాట్లాడారు. అనంతరం గృహసారథులకు పార్టీ అందించిన కిట్లను నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసీఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కన్వీనర్ మనోజ్‌రెడ్డి

పథకాలను వివరించండి

చిల్లకూరు: సంక్షేమ పథకాలను ప్రతి గడపలో ప్రజలకు వివరించాలని సచివాలయ మండల కన్వీనర్ వెదనపర్తి మనోజ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లెలో మంగళవారం గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో మా నమ్మకం– నువ్వే జగన్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంథామరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, సచివాలయ కన్వీనర్లు అన్నంరెడ్డి రమేష్‌రెడ్డి, కనపర్తి దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

గృహ సారథులు, వలంటీర్ల సమావేశం

కలువాయి: మండల కేంద్రంలో మంగళవారం గృహసారథులు, వలంటీర్ల సమావేశం నిర్వహించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మాదాసు పవన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డిలు మా నమ్మకం– నువ్వే జగన్ కార్యక్రమంలో పథకాల గురించి ఇంటింటా ఎలా ప్రచారం చేయాలన్న విషయం తెలిపారు. నాయకులు మేకపాటి వెంకటనరసారెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వల్లివేడులో బాలామృతం పంపిణీ చేస్తున్న ఎంపీపీ తనూజరెడ్డి

వెంకటగిరి రూరల్: గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఎంపీపీ తంబిరెడ్డి తనూజరెడ్డి తెలిపారు. మండలంలోని వల్లివేడు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు తదితర పోషకాహారం తీసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పెరటిలో ఆకు కూరలు, కూరలు, పండ్లు పెంచుకుంటే మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రక్తహీనత లేకుండా ఉండవచ్చన్నారు. అనంతరం మహిళలకు బాలామృతం పంపిణీ చేశారు. అలాగే పారవోలు, సిద్ధవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శంషాద్ బేగం, సూపర్‌వైజర్ జీ కృష్ణవేణి, అంగనవాడీ వర్కర్లు జ్యోతి, ఉమ, పార్వతి, కుమారి, వెంకటమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

డక్కిలి: మండలంలోని పలు గోడు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. అనంతరం జగనన్న గోరు ముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. రోజు నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

బందోబస్తు సక్రమంగా నిర్వహించండి



మాట్లాడుతున్న సీఐ దశరథరామారావు

చిల్లకూరు: పరీక్షలు జరుగుతున్న క్రమంలో పోలీస్ సిబ్బంది ఆయా పాఠశాలల వద్ద సక్రమంగా బందోబస్తు నిర్వహించాలని గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు సూచించారు. మండల కేంద్రంలోని చిల్లకూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు.


విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



శివ మృతదేహం

వెంకటగిరి: ఉపాధ్యాయనగర్‌లోని ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వెంకటగిరికి చెందిన దారా శివ (30) సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఉపాధ్యాయనగర్‌లో ఓ ఇంట్లో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఓ మెకానిక్‌తో కలిసి శివ మరమ్మతులు పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం వెంకటగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించాడు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

పీఆర్ ఏఈకి రాష్ట్రస్థాయి గుర్తింపు



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఇలియాస్ అహ్మద్

గూడూరు: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన చిల్లకూరు మండల పంచాయతీరాజ్ ఏఈ ఇలియాస్ అహ్మద్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక డివిజన్ పంచాయతీ రాజ్ కార్యాలయంలో పీఆర్ సూపరింటెండెంట్ శంకర నారాయణ చేతులు మీదుగా ఈ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ గిరినాథ్, డీఈ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి రాక

సైదాపురం: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం సైదాపురంలో పర్యటించనున్నారని జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పొదుపు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులకు మైనర్ల అప్పగింత

కోట: విద్యానగర్ నీలగిరి సంఘం కాలనీకి చెందిన ఇద్దరు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఓ ప్రేమజంట రెండు రోజులుగా కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు కోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రేమజంట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రక్షణ కల్పించాలని ఎస్ఐని కోరింది. విచారణ జరిపి ఇద్దరు మైనర్లుగా నిర్ధారణ కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు మూలంరాజు భాణుప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన వేమన బాలాజీ ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

గ్లాసుల వితరణ

గూడూరురూరల్: విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాగి జావ తాగేందుకు అవసరమైన 150 గ్లాసులను మిట్టాత్మకూరుకు చెందిన పూర్వ విద్యార్థి చిల్లకూరు సుధీర్‌రెడ్డి మంగళవారం వితరణ చేశారు. హెచ్ఎం డి.జయరామనాయుడు, జోసెఫ్, సురేష్, రఘురామ్, పుల్లంరాజు, అనిల్, మురళీకృష్ణ, దయాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.